మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- శరవేగంగా మూలపేట పోర్టు పనులు
- రూ.380 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్
- పెదగనగళ్లవానిపేట సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు


ఫిష్‌ఆంధ్రా లబ్ధిదారులకు రుణపత్రాలను అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, పెదగనగళ్లవానిపేట యువత కోరిక మేరకు మూడు ఎకరాల క్రీడా మైదానాన్ని మంజూరు చేశామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గురువారం పెదగనగళ్లవానిపేటలో నిర్వహించిన మత్స్యకారుల సదస్సుల్లో ఆయన మాట్లాడారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతలు ప్రభుత్వమని చెప్పారు. ప్రస్తుతం పెదగనగళ్లవానిపేట గ్రామానికి ఆనుకొని ఉన్న బీచ్‌ను రానున్న రోజుల్లో మరింత హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే ఉన్న రోడ్డును 40 అడుగుల రహదారి చేసేందుకు రూ.18కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందించినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కువ మంది మర్చంట్ నేవీలో పనిచేస్తున్నారని, భవిష్యత్‌లో వారంతా ఇకనుంచి మూలపేట పోర్టు వద్దే దిగుతారని, పోర్టు పూర్తయితే పెద్దపెద్ద షిప్‌లకు మూలపేట పోర్టు వేదిక కానుందని వివరించారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే జరుగుతోందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో నాలుగు పెద్ద పోర్టులు, 8 ఫిషింగ్ హార్బర్‌లు నిర్మితమవుతున్నాయని చెప్పారు. ఇప్పటికే రూ.380 కోట్లతో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఫిషింగ్ హార్బర్ పూర్తయితే మత్స్యకారులు కేరళ, గుజరాత్, తమిళనాడు వంటి ప్రాంతాలకు బోటింగ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.


యువతకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

వైఎస్సార్ సీపీ యువ నాయకుడు దర్మాన రామ్ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతోనే యువతకు 3 ఎకరాల గ్రౌండ్ అందించామన్నారు. అనంతరం క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చీకటి గురమ్మ గురుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 11 మందికి ఇళ్ల పట్టాలు, 20 మంది ఫిష్‌ఆంధ్రా లబ్ధిదారులకు రూ.15.7 లక్షలు, ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహన లబ్ధిదారులకు ప్రభుత్వ సబ్సిడీతో రూ.5.31 లక్షల చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో చీకటి గురుమూర్తి, లక్ష్మణరావు, అప్పారావు, మైలపల్లి శ్రీనువాసరావు, మైలపల్లి సోమయ్య, కొమర గురుమూర్తి, గలగళ్ల రాములు, రాజు, గనగళ్ల లోకరాజు, కృష్ణ, కామేష్, పార్టీ నాయకులు గొండు కృష్ణ, అంబటి శ్రీను, మూకళ్ల తాతబాబు, చిట్టి జనార్దనరావు, అంబటి నిర్మల, గంగు నరేంద్రకుమార్, రుప్ప దివ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులకు సన్మానిస్తున్న మత్స్యకార సమితి సభ్యులు

రణస్థలం: జాతీయ అండర్ 19 స్కూల్ గేమ్స్, ఖేలో ఇండియా యూత్ వాలీబాల్ గేమ్స్‌లో ఏపీ తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి సత్యంను రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులు సన్మానించారు. మండలంలోని కొవ్వాడ మత్స్యలేశం గ్రామంలో ఈ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఇటీవల ఆడుదాం-ఆంధ్రా వాలీబాల్ పోటీల్లో కొవ్వాడ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో ప్రతిభ కనబర్చినవారికి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి వాసు వాడబలిజ, సభ్యులు జగ్గారావు, గ్రామ నాయకులు బడి రాంబాబు, మైలపల్లి పట్టయ్య, జగ్గులు, పిల్ల తాత, ఉప్పాడ అప్పన్న తదితరులు ఉన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: పర్యావరణ పరిక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని హడ్కో కాలనీలో గురువారం లయన్స్ క్లబ్ హర్షవల్లి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని ఆహ్లాదకరంగా మార్చే శక్తి ఒక్క చెట్లకే ఉందన్నారు. వాతావరణంలో పెరుగుతున్న కాలుష్య కారకాలను మొక్కలు పీల్చుకొని మానవాళికి మేలు చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ హర్షవల్లి అధ్యక్షురాలు కె.శోభారాణి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, అటవీశాఖ రేంజ్ అధికారి కె.రాజశేఖర్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి కె.దాలినాయుడు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఫుడ్ కార్పొరేషన్ మెంబర్


మంత్రి ధర్మానను కలిసిన గోవిందరాజులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును గార మండలం కొర్ని పంచాయతీ సర్పంచ్ పీస గోవిందరాజులు గురువారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా అవకాశం కల్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీలు గొండు రఘురామ్, అంబటి శ్రీనివాసరావు, ముంజేటి కృష్ణమూర్తి, గొండు జయరాం తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు


ఎస్‌ఐ కేశవరావు, లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్


ఏఆర్ డీఎస్పీ కె.ఎస్.వాసన్‌ను సత్కరిస్తూ..

శ్రీకాకుళం క్రైమ్ : ప్రజలకు పారదర్శకంగా సేవలందించే పోలీసులకు మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ అన్నారు. గురువారం ఉద్యోగ విరమణ పొందిన ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ కె.ఎస్.వాసన్, స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ సదాశివుని కేశవరావులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ డీఎస్పీ వాసన్ 35 ఏళ్లు, ఎస్‌ఐ కేశవరావు 36 ఏళ్ల సర్వీసులో ఎన్నో ఆటుపోటులు, ఒడిదుడుకులు ఎదురైనా ఎటువంటి రిమార్కులు లేకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలు, ప్రజల్లో మంచితనాన్ని పొందారని గుర్తు చేశారు. జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఎస్పీ రాధిక తెలియజేశారని పేర్కొన్నారు. స్పెషల్ బ్రాంచి డీఎస్పీ ఎ.త్రినాథరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రినాయుడు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.విజయ్‌కుమార్, ఏఓ సీహెచ్ గోపీనాథ్, రమేష్, నర్సింగరావు, పోలీసు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, కె.అప్పన్న, భుజంగరావు, కృష్ణంనాయుడు, జగదాంబ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా హాల్‌ను ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

ఎచ్చెర్ల క్యాంపస్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, విద్యార్థులు యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన యోగా హాల్‌ను గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. యోగా, ధ్యానంతో శారీరక, మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత, ప్రశాంతత కలుగుతుందన్నారు. క్యాంపస్ వైద్యురాలు అరుణ, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి మునిరామకృష్ణ, డీన్ మోహనకృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయంలో (మెళియాపుట్టి) ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.రాధకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతికి (ఆంగ్ల మాధ్యమంలో సీబీఎస్ఈ సిలబస్) ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 6వ తరగతిలో బాలురకు 30 సీట్లు, బాలికలకు 30 సీట్లు, 7వ తరగతిలో బాలురుకు రెండు సీట్లు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు ఏకలవ్య మోడల్ పాఠశాల సమయంలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న దిశా ఎస్ఐ చంద్రకళ

శ్రీకాకుళం క్రైమ్ : సమాజంలో మంచి ప్రవర్తనతో మెలిగి తల్లిదండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని దిశా ఎస్ఐ ఎస్.చంద్రకళ అన్నారు. నగరంలోని శాంతినికేతన్ విద్యార్థులతో గురువారం బాల్యవివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, టీనేజ్ ఆకర్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాటి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. విద్యార్థినులను ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దిశా సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శాంతినికేతన్, కౌముది ప్రైవేట్ కళాశాలల్లో శుక్రవారం నుంచి జూనియర్ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, ఆదిత్య, శాంతినికేతన్, కౌముది, సాయి, కేజీబీవీ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం నుంచి 809 మంది, రెండో సంవత్సరం నుంచి 672 మంది పరీక్షలు హాజరుకానున్నారు. గతంలో ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్ర ఉన్నా.. ఈ ఏడాది కేటాయించలేదు.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడిచెత్తను పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ తమీం అన్సారియా ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నగరపాలక సంస్థ శానిటేషన్ కార్యదర్శులతో మాట్లాడారు. పారిశుద్ధ్యంపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. దోమల నియంత్రణ, కాలువల్లో పూడికలు తొలగించాలని కోరారు.

ఘనంగా నూకాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని గ్రామదేవత నూకాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవం మాఘబహుళ పంచమి గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి ముగ్గులు, కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ జరిగింది. కార్యక్రమంలో నక్కవీధి, దేశెల్లవీధి, కుందనపువీధి గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేడు పీహెచ్‌సీ ప్రారంభం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జి.సిగడాం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్థానిక నాయకులు గురువారం తెలిపారు. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఆస్పత్రిని నిర్మించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డీస్ ఫౌండేషన్ సీఈఓ హాజరవుతారన్నారు.

షిరిడీసాయికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి మూడు హారతులు ఇచ్చి అభిషేకాలు చేశారు. భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.

గ్రామాల్లో ప్రజాపోరు యాత్ర

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలస, తదితర గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర–2ను ఆ పార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. నియోజకవర్గ సహాయ కన్వీనర్ సంపతరావు నాగేశ్వరావు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి గురువారం వరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లామన్నారు. గ్రామాల్లో ప్రధాన మంత్రి మోదీకి అధిక సంఖ్యలో అభిమానులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుణ్యపు శంకరరావు, బాల సత్యనారాయణ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంచేందుకు కృషి


విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న పరిశీలకుడు

గార : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని, అందులో భాగంగా ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విద్య, ప్రత్యేక ప్యానెళ్ల ద్వారా డిజిటల్ బోధన, ఐబీ కరుక్యులమ్ పద్ధతి అవలంబిస్తోందని ఎల్ఐపీ పరిశీలకుడు ప్రొఫెసర్ ఎస్.ఉపేంద్రరెడ్డి అన్నారు. గురువారం అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో ఎల్ఐపీ పద్ధతిపై బోధనలు పరిశీలించారు. అభ్యసన సామర్థ్యం పెంచేందుకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై హెచ్ఎం ఎల్ఐపీ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.లక్ష్మీనారాయణ, ఎంఈవో పి.వినోదిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న సర్పంచ్ సోనియా

జి.సిగడాం: ప్రజల సహకారంతోనే గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేపడుతున్నామని పెంట గ్రామ సర్పంచ్ పున్నాన సోనియా అన్నారు. స్థానిక సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, వీటికి నిదర్శనమే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, తదితర భవనాలన్నారు. సంక్షేమ పథకాలతోపాటు మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ కృషితో కల్పించామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ యు.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం


విలేజ్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత గ్రామాల స్వరూపం పూర్తిగా మారిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. అల్లినగరం–2 గ్రామ సచివాలయం పరిధిలోని అరిణాంఅక్కవలసలో ఉపాధి నిధులు రూ.17.05 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రూ.21.08 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంతోపాటు సిమెంట్ రోడ్డును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను ప్రజలు గమనించాలన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల విధ్వంస పాలన ప్రజలకు ఇప్పటికీ గుర్తుందన్నారు. అప్పట్లో ప్రభుత్వ పథకాలు ఒక వర్గానికి మాత్రమే చేరాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేసి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలు విస్మరించిన చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు పాలనంతా మోసాల చరిత్ర అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెండు రామారావు, లింగాల లక్ష్మణరావు, అంబటి సుజాత, కూనపు నర్సింగరావు, టిగుటి రమణబాబు, శేష సూర్యనారాయణ, దొంక వెంకటరమణ, వెంకునాయుడు, వెంపల ఆదినారాయణ, దేవరపల్లి నానాజీ, సి.హెచ్.రమణ, కోటేశ్వరరావు, ఈశ్వరరావు, వెంకటరావు, పీఆర్ జేఈ సూర్యచంద్ర, ఏఓ సురేష్, వైద్యాధికారి ఉషశ్రీ, గ్రామ కార్యదర్శి పి.విజయకుమారి పాల్గొన్నారు.

రేపు ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మొదలయ్యే ఈ జాబ్‌మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, ఆర్‌అండ్‌డీ, క్యూసీ, క్యూఏ, నిట్, ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్స్ మేనేజర్, ముత్తూట్ గ్రూప్, అపోలో ఫార్మసి లిమిటెడ్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, పేటీఎం, ఆరా మోటర్స్, వినిస్, హీరావత్, అరబిందో ఫుడ్స్, హరీష అండ్ బెవరేజెస్, 7హిల్స్ ఎంటర్‌ప్రైజెస్ తదితర కంపెనీలు/సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరగనున్నాయని వివరించారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ తదితర కోర్సులు ఉత్తీర్ణులై 35 ఏళ్లలోపు వయస్సు కలిగినవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం, ఇతర అలవెన్సులు, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. జేకేసీ కోఆర్డినేటర్ పి.మణికుమార్ (సెల్: 99492 94968, 8143277610)ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వత్సవలసలో వాటర్ ట్యాంక్ ప్రారంభం



ట్యాంకును ప్రారంభించిన ఎంపీపీ రఘురామ్

గార : వత్సవలస రాజులమ్మ తల్లి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు పప్పు బాబూరావు రూ.4 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంకును నిర్మించారు. మైలపల్లి నల్లయ్య, గన్నెమ్మ, నీలమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ట్యాంకును గురువారం ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, శిమ్మ ధర్మరాజు, వమరవల్లి ఉదయభాస్కరరావు, కెప్టెన్ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఫారం పాండ్ పనులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

గార: గరిష్ఠ వేతనం సాధించేలా ఉపాధి పనిచేయించాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు సిబ్బందికి సూచించారు. గురువారం నిజామాబాద్ పంచాయతీ కర్రి చెరువు, శ్రీకూర్మం వద్ద జరుగుతున్న ఫారమ్‌పాండ్ పనులను ఆయన పరిశీలించారు. రెండు పూటలా కనీసం 8 గంటలు పనిచేయాలన్నారు. వేసవి అలవెన్సులు వస్తున్నందున ఎక్కువ పని చేయాలన్నారు. సుస్థిర వనరులు సృష్టించుకోవాల్సిన బాధ్యత మీదేనని, చెరువులు, పంట కాలువ పనులు చక్కగా చేపడితే నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


అట్టలు, పెన్నులతో విద్యార్థులు

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలో చదువుకుంటున్న ఇంటర్, పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నా మని ప్రిన్సిపాల్ బి.సుధ తెలిపారు. శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అంధవరపు సంతోష్‌కుమార్ విద్యార్థులకు అట్టలు, పెన్నులు గురువారం పంపిణీ చేశారు. బ్లడ్ బ్యాంక్ మేనేజర్ టి.మణికంఠ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నతస్థాయిలో నిలవాలన్నారు. దూసి సంతోష్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారులకు బోధన


బోధనా పద్ధతులను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ గోవిందరావు

గార: ప్రత్యేక అవసరాల చిన్నారులకు వినూత్న బోధన అవసరమని, ఇందుకు తల్లిదండ్రుల సహకారం ఉండాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గోవిందరావు అన్నారు. గురువారం కుమ్మరిపేటలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. ప్రత్యేకమైన బోధన పరికరాలతో బోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. రిసోర్సుపర్సన్ ఏ.రఘులక్ష్మీ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని వివరించారు.

